క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె : 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 12వ తేదీ సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు రేపల్లె పట్టణం, రూరల్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆ శాఖ డిప్యూటీ ఈఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం



నిజాంపట్నం: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు శ్రమించాలని జెడ్పీటీసీ సుబ్బయ్య చెప్పారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కోదండ రామాలయం, యాదవపాలెం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నిజాంపట్నం రామాలయంలో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా పదో తరగతిలో 550పైగా మార్కులు సాధించిన గంగుల శ్రీదేవి, దొంతిబోయిన రూపేష్, దొంతిబోయిన వెంకట నన్నురమ్మ, మొవ్వ శివ వీరకుమార్, కుర్ర తన్మయిశ్రీ, మరక మురారి, కుర్ర తేజసాయిలను సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గంగుల సాయి రమేష్, దబ్బుకూటి హరిబాబు, మరక శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి చద్ది నైవేద్యం



బాపట్ల: బాపట్ల పట్టణంలోని గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి చద్ది నైవేద్యం కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఆదివారం ప్రారంభించారు. భీమావారిపాలెం నుంచి ప్రభ ఊరేగింపుగా పోలేరమ్మతల్లి దేవాలయానికి చేరుకుంది. గ్రామ దేవతకు భక్తులు భారీగా మొక్కులు తీర్చుకున్నారు.

మాజీ ఉప ఎంపీపీ వేమూరు జక్రయ్య మృతి



వేమూరు: మాజీ ఉప ఎంపీపీ వేమూరు జక్రయ్య (75) అనారోగ్యంతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 2000 నుంచి 2005 వరకు ఎంపీటీసీ మెంబరుగా పని చేశారు. మండల పరిషత్ ఉప ఎంపీపీగా పని చేశారు. తెనాలి మార్కెట్ యార్డు మాజీ డైరెక్టరుగా పని చేశారు. వైఎస్సార్‌సీపీకి ఎనలేని సేవలు అందించారు. ఆయన మరణం పట్ల మాజీ ఎంపీపీ దాది వెంకట రాజ్యలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు దాది సుబ్బారావు, కోగంటి లవకుమార్, మాజీ ఎంపీపీ బొల్లిశెట్టి ప్రభాకరరావు, దున్నా మేరీసుబాబు, తలతోటి సువర్ణరావు, తలతోటి జిగిన్‌బాబు, గుమ్మడి దానియేలు, దర్శి శ్రీకాంత్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాప వ్యక్తం చేశారు.

మాతృమూర్తులకు సత్కారం



తెనాలిరూరల్: అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో సీనియర్ సిటిజన్లైన మహిళా సభ్యులను సత్కరించి గౌరవించారు. సంఘ కాపరి బిషప్ డాక్టర్ పినపాటి జాన్‌పాల్ ఆధ్వర్యంలో అత్తోట రత్నకుమారి, కూచిపూడి సువర్ణకుమారి, రుద్రపాటి విక్టోరియా జ్యోతి, ఈవూరి భారతి, అత్తోట దేవకరుణ, చావలి సుభాషిణి, మిస్సమ్మ, ఆరమళ్ల చిన్నలను సత్కరించారు. సంఘ పెద్దలు పినపాటి డేవిడ్ రాజు, ఈవూరు శ్రీనివాసరావు, ఆరె దానియేలు, కసుకుర్తి భాస్కరరావు, జయరాజు, కొలవరపు ఏసుదాసు, పినపాటి ఫ్రాన్సిస్, ఈవూరి ఏసురత్నం పర్యవేక్షించారు. సంఘస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్స్ డే

తెనాలిఅర్బన్: ఇస్లాంపేటలోని యేసయ్య కొండ ప్రార్థన మందిరంలో మదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ ఆనందన్న మాట్లాడుతూ కుటుంబంలో తల్లి పాత్ర ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. మాతృమూర్తుల రుణాన్ని ప్రతి ఒక్కరూ తీర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దైవసేవకురాలు పి.రత్నకుమారి, చార్లెస్ వెస్లీ, ప్రశాంత్‌బాబు, వల్లి, నిర్మల, అలేఖ్య, అమూల్య, ఎబెన్, గ్రేసీ, ఆయాన్ష్, తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న పల్లెలు

- రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్త చెదారం నిల్వలు
- గ్రామాల్లో కానరాని స్వచ్ఛత, ప్లాస్టిక్ నిషేధం
- పట్టించుకోని అధికారులు



దరివాదకొత్తపాలెంలో రోడ్డు పక్కనే దర్శనం ఇస్తున్న వ్యర్థాలు



రామానగర్‌లో పేరుకుపోయిన చెత్త నిల్వలు

బాపట్లటౌన్ : పచ్చని చెట్లతో చల్లని గాలులు వీస్తూ.. ఆహ్లాదానికి మారుపేరుగా నిలిచే గ్రామీణ ప్రాంతాలు నేడు రోజుల తరబడి నిల్వ ఉంటున్న వ్యర్థాలతో వాతావరణ కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా ఆయా గ్రామాల శివారులో వ్యర్థాల నిల్వలే ముందుగా స్వాగతం పలుకుతున్నాయి. గ్రామాల్లో కూడా ఎక్కడో మారుమూలన కాదు.. ముఖ్యంగా జన సంచారం.. ప్రధాన రహదారులు, దేవాలయాలు ఉండే ప్రాంతాల్లో చెత్తను వేస్తూ ఆయా ప్రాంతాలను కంపు కొట్టిస్తున్నారు.

ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే

మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్లపై చెత్త చెదారం నిల్వలు పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారులపై కూడా వ్యర్థ పదార్థాలను విచ్చలవిడిగా పడేస్తున్నారు. గతంలో తడి చెత్త, పొడి చెత్తపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించే వారు. ప్రస్తుతం గ్రామస్తులకు చెత్తపై ఒక్కరోజు కూడా అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. ముఖ్యంగా మండలంలోని అసోదివారిపాలెం, దరివాదకొత్తపాలెం, రామానగర్, భర్తిపూడి, గుడిపూడి, పూండ్ల మరుప్రోలువారిపాలెం, జమ్ములపాలెం తదితర గ్రామాల్లో రోడ్ల వెంబడే చెత్తచెదారం నిల్వలు ఎక్కువగా ఉన్నాయి. ఆయా గ్రామాలకు వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తుందని ప్రయాణికులు, గ్రామస్తులు వాపోతున్నారు.

లేని ప్లాస్టిక్ నిషేధం

ప్లాస్టిక్ వస్తువుల వాడకం మానవ మనుగడకే ముంపు.. ఎవరైనా ప్లాస్టిక్ వస్తువులు విక్రయించినా.. వాడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.. ఈ విషయంపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులు ఆయా ప్రాంతాల్లో పనిచేసే ప్రభుత్వ సిబ్బందికి అనేక పర్యాయాలు చెప్పినప్పటికీ ఎక్కడా ప్లాస్టిక్ వస్తువుల నిషేధం అమలయిన దాఖలాలు లేవు. యథేచ్ఛగా ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్నారు. వాడకం దారులు వాటి ఉపయోగం అయిన వెంటనే వాటిని రోడ్ల వెంబడి పారేయటంతో వ్యర్థాలతోపాటు, ప్లాస్టిక్ వస్తువులు తిని ఆవులు, గేదెలు, గొర్రెలు మృత్యువాత పడుతున్న సందర్భాలు అనేకం లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్ వస్తువుల నిషేధంతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల వెంట ఉన్నటు వంటి చెత్త చెదారం నిల్వలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణప్రజలు కోరుతున్నారు.



అసోదివారిపాలెంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త నిల్వలు

28 సంవత్సరాల తర్వాత ఆత్మీయంగా...



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కర్లపాలెం: ఒకేచోట కలసి చదువుకున్న విద్యార్థులు సుమారు 28 సంవత్సరాల తరువాత తమకు చదువులకు నీడనిచ్చిన పాఠశాలలో కలుసుకున్నారు. కర్లపాలెం మండలం చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996–97 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని కలుసుకున్నారు. 28 సంవత్సరాల తరువాత కలుసుకోవటంతో సంతోషంతో ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. తమ బాల్యపు మధురానుభూతులను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను గుర్తు చేసుకున్నారు. ఒకరి కుటుంబ విశేషాలను మరొకరు తెలుసుకుని తమ తోటి విద్యార్థులు కొందరు ఉన్నత శిఖరాలను అధిరోహించటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

భక్తి ప్రపత్తులతో నృసింహ జయంతి

జంపని(వేమూరు): వేమూరు మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నరసింహ జయంతి పర్వదినాన్ని భక్తులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం అర్చకులు లక్ష్మీ నరసింహస్వామి వారి ప్రతిమకు పంచామృత అభిషేకం, అష్టోత్తరం, సహస్ర నామార్చన, లక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. పాములపాటి శివరామకృష్ణ దంపతులు నిర్వహించిన కార్యక్రమంలో వీరాంజనేయ కోలాట భజన తిరుమల తిరుపతి దేవస్థానంలో దాస సాహిత్య ప్రాజెక్టు భజన సంఘాల సభ్యులు విష్ణు సమస్త నామ స్తోత్ర పారాయణ, హనుమాన్ చాలీసా పారాయణ, లక్ష్మీ అష్టోత్తర స్తోత్ర పారాయణ, గోవింద నామాలు, భక్తి కీర్తనలు ఆలపించారు.

చెన్నకేశవస్వామికి వెండి శంఖు చక్రాల సమర్పణ



జంపని(వేమూరు): జంపని చెన్నకేశవ స్వామి వారికి వెండి శంఖు చక్రములను వీరాంజనేయ స్వామి వారికి వెండి పట్టెడ సమర్పించడం జరిగిందని అర్చకులు శ్రీనివాసమూర్తి తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో చెన్నకేశవ స్వామి వారికి అదే గ్రామానికి చెందిన గాదంశెట్టి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ధర్మపత్ని రాజ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు ఆదివారం చెన్నకేశవస్వామికి వెండి శంఖు చక్రములు, వీరాంజనేయస్వామికి వెండి పట్టెడ సమర్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఆగమ శాస్త్రం ప్రకారం అర్చకులు స్వామి వార్లకు సమర్పించారు. వస్తువులకు పంచామృతములతో శుద్ధి కార్యక్రమం జరిపారు. పంచ సూక్తాలు, మన్య సూక్తం, సుదర్శన స్తోత్రం, పాంచజన్య స్తోత్రం పఠించారు. విశేష పూజ అనంతరం దాతలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ చెట్టు



రోడ్డుకు అడ్డంగా పడిన భారీ చెట్టు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ప్రధాన రహదారిలో కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఆదివారం ఓ భారీ చెట్టు నేలకొరిగింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో తాడేపల్లి ప్రధాన రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. కమిషనర్ అలీమ్‌బాషాకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఆయన కార్పొరేషన్ సిబ్బందిని పంపించి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు. జేసీబీ సహాయంతో ఆ చెట్టును పూర్తిగా పక్కకు నెట్టించివేశారు. ఈదురు గాలులు లేకున్నా భారీ చెట్టు పడిపోవడంతో పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. నిత్యం ఆ రహదారిలో ద్విచక్రవాహనాలు, కార్లు, ఇతర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. చెట్టు పడే సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. రోడ్డు పక్కన చెట్టుకు ఎదురుగా పార్కింగ్ చేసిన కారు స్వల్పంగా దెబ్బతింది.

ఏసీసీ కార్మికుల శ్రమ ఫలించనుందా!

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షల శ్రమ ఫలించనుంది. కార్మికులు హైకోర్టులో వేసిన ఛాలెంజ్ కేసులు ఇటీవల విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా ఆదివారం పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్‌కు గురైన అనంతరం 2003 కలకత్తా డి.ఆర్.టి కోర్టు కంపెనీ ఇండియన్ బ్యాంక్‌కు బకాయి ఉందని.. తాడేపల్లిలో కార్మికులు దీక్షలు కొనసాగిస్తున్న ఫ్యాక్టరీ ఆస్తులను వేలం వేసిందని అన్నారు. వేలంలో రూ.10.92 కోట్లు బాలభాను ఎంటర్‌ప్రైజెస్ పేరు మీద ఎస్.ఆర్.ఐలు వేలంలో ఈ భూములను దక్కించుకున్నారని తెలిపారు. కొన్ని అనివార్య కారణాలతో ఆగిన అప్పటి ఈ కేసు 2025 ఏప్రిల్‌లో హైకోర్టులో డివిజన్ బెంచ్ ఫైనల్ హియరింగ్‌కు వచ్చిందని.. వేసవి సెలవుల అనంతరం కేసును విచారిస్తామని కోర్టు ప్రకటించిందని తెలిపారు. కార్మికుల తరుపున వాదించిన లాయర్లు కార్మికులకు నష్టపరిహారం వస్తుందని ఆశాభావంతో ఉన్నారని తెలిపారు. కాకపోతే నష్ట పరిహారం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లిస్తుందా లేక భూములు కొనుగోలు చేసిన సంస్థ తరుపున ఎస్.ఆర్.ఐలు చెల్లిస్తారా అనేది వేచిచూడాలి. ఏమైనప్పటికీ 30 ఏళ్ల పోరాటానికి మంచి రోజులు రానున్నాయని యూనియన్ నాయకులు, కార్మికులు అంటున్నారు.

ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు అందించడమే లక్ష్యం



భూమిపూజలో నందం అబద్ధయ్య

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో ప్రతీ ఇంటికీ కృష్ణా జలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక టిడ్కో గృహాలకు తాగునీటి సరఫరా నిమిత్తం తాడేపల్లి చైతన్య తపోవన్ సమీపంలో గుంటూరు చానల్ వద్ద తాగునీటి పైప్‌లైన్ పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నందం అబద్ధయ్య మాట్లాడుతూ.. ఇటీవల టిడ్కో గృహాలను సందర్శించిన సీఎం చంద్రబాబు ఇంటింటికీ కృష్ణా జలాలను సరఫరా చేస్తాన్న హామీకి ఈ భూమి పూజ నిర్వహించామని తెలిపారు. టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో ప్రత్యేక పూజలు

పెదకాకాని: స్థానిక శివాలయంలో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం జరిగిన పూజా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో నవగ్రహ, రాహుకేతువు పూజలను జరిపారు. అర్చకస్వాములు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తముగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శాంతి భద్రతలు రక్షించటం ప్రతి ఒక్కరి బాధ్యత

డీఎస్పీ శ్రీనివాసరావు



బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేపల్లె: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు అన్నారు. భారత్ – పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, వివిధ ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రయాణికుల లగేజీలను పరిశీలించారు. ప్రజలు అనుమానాస్పద స్థితిలో వ్యక్తుల సంచారం ఉంటే పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. లాడ్జీలు, రూమ్‌లలో అద్దెలకు ఎవరైనా వస్తే తనిఖీలు నిర్వహించటంతో పాటు వారి పూర్తి వివరాలను సేకరించి మాత్రమే ఇవ్వాలని, అనుమానంగా ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రస్తుత యుద్ధ నేపథ్యంలో ఉగ్రవాదుల జాడపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటం జరిగిందని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జన సంచార ప్రాంతాలలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. తనిఖీలలో పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.


గుండె జబ్బులపై అప్రమత్తత అవసరం



డాక్టర్ వెంకటేష్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

తెనాలిటౌన్: గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పి.వెంకటేష్ సూచించారు. స్థానిక నందులపేటలోని కవిరాజాపార్కు వీజీకే భవనంలో ఆదివారం వాకర్స్ క్లబ్ ఏప్రిల్, మే నెల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ పి.వెంకటేష్ విచ్చేసి షుగర్ వ్యాధి వలన వచ్చే అనర్థాలను, వ్యాధులను వివరించారు. షుగర్ దీర్ఘకాలంగా ఉన్నవారికి ఇతర అవయవాలైన గుండె, కిడ్నీ, రక్తనాళాలు, మెదడు మొదలైన వాటి మీద ప్రభావం చూపుతుందన్నారు. రక్తనాళాల్లో రక్తప్రసరణ తగ్గి రక్తం గడ్డకట్టడం వలన గుండె జబ్బుకు దారి తీస్తుందని సూచించారు. అదేవిధంగా కిడ్నీమీద కూడా ప్రభావం చూపుతుందన్నారు. తరచుగా రక్త, మూత్ర పరీక్షలు చేయించుకుంటూ నడక, వ్యాయామం వంటివి చేయాలని సూచించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు పాలడుగు ఆనందయ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి కడియాల రవిబాబు, డాక్టర్ ఉదయ కిషోర్, రత్తయ్య, అశోక్, మొవ్వా సత్యనారాయణ, వీరసయ్య, రంగారావు, సాంబశివరావు, ఉదయశంకర్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందిచడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



పరేడ్‌లో పాల్గొన్న స్వయం సేవకులు

తెనాలిటౌన్: దేశభక్తి, వ్యక్తిత్వ వికాసం యువతలో పెంపొదించడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పనిచేస్తుందని పొత్తూరి ఆదిశేషయ్య, అంబటి మారుతీరామ్‌లు పేర్కొన్నారు. ఆదివారం తెనాలి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నుంచి బయలుదేరి గాంధీ చౌక్, రామాలయం, గంగానమ్మగుడి, శివాలయం, పాతగవర్నమెంట్ హాస్పటల్, శివాజీచౌక్ మీదుగా వాసవీ అమ్మవారి దేవస్థానానికి స్వయం సేవకులు ర్యాలీ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ వార్షిక ప్రథమ శిక్షా వర్గ కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో మే 1వ తేదీ నుంచి 17 వరకు యువతకు ట్రైనింగ్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో దేశభక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే అంశాలను నేర్పించినట్లు తెలియజేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించేదుకు వెనుకాడబోమని స్వయం సేవకులు ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలో నిర్వహించిన స్వయం సేవకుల పద సంచలనం ఎంతగానో ఆకట్టుకుంది. నేర్చుకున్న శిక్షణను ప్రజలకు పరిచయం చేయడానికి ఈ పరేడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈపూరి హరిపూర్ణ ప్రసాద్, జొన్నాదుల మనోహర్, శివశక్తి సుధాకర్, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, హిందూ చైతన్య వేదిక, రాష్ట్ర ఉపాధ్య పరిషత్ కార్యకర్తలు, 300 మంది స్వయం సేవకులు పాల్గొన్నారు.

● చెత్త కాల్వ..!



పూలే కాలనీ వద్ద కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు

పట్టణంలోని పూలే కాలనీకి వెళ్లే రహదారి వెంట ఉన్న ప్రధాన కాల్వల్లో వ్యర్థాల గుట్టలు దర్శనమిస్తున్నాయి. కాల్వ చెత్త, చెదారంతో నిండి దుర్గంధభరితంగా మారింది. నిత్యం అటువైపుగా వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. వీటివలన విపరీతమైన దుర్గంధంతో పాటు, దోమల వ్యాప్తి పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కాల్వలను బాగు చేయాలని కోరుతున్నారు.

– తెనాలిఅర్బన్

జూన్ 7న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



తెనాలిఅర్బన్: కొల్లిపర మండలం తూములూరు గ్రామంలోని క్రిస్టియన్‌పాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జూన్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం 5గంటల జరిగే కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. పెద్ద సంఖ్యలో దళిత నాయకులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు గల్లా జ్ఞానశేఖర్, తెనాలి యోహాన్, కనపర్తి మోహనరావు, కనపర్తి సుధాకర్, బేతాళ భూషణం, మధిర నాగేశ్వరరావు, కనపర్తి జేమ్స్, కనపర్తి అబ్రహాం లింకన్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలిటౌన్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ సేవాశాంతి ఆశ్రమంలో ఆదివారం మదర్స్ డే సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నిర్వాహకుడు ముద్దాబత్తుని రమణయ్య ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ సీనియర్ నాయకుడు అడపా సంపత్‌రాయుడు పాల్గొని వృద్ధులకు అన్నదానం చేశారు. యోగ సభ్యులు రమణయ్య వారి తల్లి అమికమ్మ జ్ఞాపకార్థం మదర్స్ డే సందర్భంగా సేవా కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సావిత్రి, అనూష, జగదీశ్వరి, ఉమామహేశ్వరి, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.